# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి పీఎం సూర్యఘర్ యోజన ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

**2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు కేంద్రమంత్రులతో ఈ రోజు సమావేశమవుతారు.**

**3. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం తెలిపింది.**

**4. ఆంధ్రప్రదేశ్ లో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘాను పెంచేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు**

**5. హైదరాబాద్ వేదికగా జరిగే 15వ హైదరాబాద్ సాహిత్య పండుగను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ రోజు ప్రారంభిస్తారు.**

==========================

వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ప్రభావవంతమైన సాధనంగా ఉపయోగపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని సంవిధాన్ సదన్ లో నిన్న జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నేతాజీ సుభాష్ చంద్రబోస్ కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడకు హాజరైన విద్యార్థులతో "ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన" గురించి వివరిస్తూ... సౌరశక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఈ విద్యుత్ ను వాహనాలకు వినియోగిస్తే కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. విద్యార్థులు ఇంటివద్దే విద్యుతు ను ఉత్పత్తి చేసి, ప్రభుత్వానికి విక్రయించవచ్చని ప్రధానమంత్రి సూచించారు. విద్యుత్ వాహనాల వినయోగం ద్వారా శిలాజ ఇంధనాలపై ఖర్చు తగ్గుతుందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అందించిన ఒక వెయ్యి 200 బస్సులు ఢిల్లీలో నడుస్తున్నాయని, భవిష్యత్ లో మరిన్ని బస్సులను ప్రవేశపెడతామని ప్రధానమంత్రి వివరించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలువురు కేంద్రమంత్రులతో ఈ రోజు సమావేశమవుతారు. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు పర్యటనను ముగించుకొని ఢిల్లీ చేరుకున్నారు.ఈ ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారని అధికారులు తెలిపారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ

అమలు, పోలవరం ప్రాజెక్టుకు రావాల్సిన నిధుల గురించి ప్రస్తావించే అవకాశం ఉంది. అనంతరం మధ్యాహ్నం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ తో చంద్రబాబు నాయుడుతో మర్యాదపూర్వకంగా సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

ఇదిలా ఉండగా రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా సాగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాలుగు రోజుల దావోస్ పర్యటన నిన్నటితో ముగిసింది. ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొన్న ఆయన.. ప్రముఖ సంస్థల సీఈవోలు, పలు దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 15 అత్యున్నత వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అందుకు అనువైన పరిస్థితులను వివరించారు.

---------------------------

స్విట్జర్లాండ్ లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం తెలిపింది. 16 ప్రముఖ సంస్థలు సుమారు 1.78 లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 49,550 మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం తెలిపింది. దావోస్ పర్యటనలో తెలంగాణ బృందంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, ఆశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు.

---------------------------

విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగదని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ. ఉక్కు కర్మాగారం పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఆర్థిక నిధులను ప్రకటించిందని చెప్పారు. .ఆగస్టు నెలాఖరు నాటికీ పూర్తి సామర్థ్యం మేర ఉత్పత్తిని పెంచి కర్మాగారాన్ని లాభాల్లోకి తీసుకొస్తామని కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ (35 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎర్రచందనం అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు రాష్ట్ర సరిహద్దుల్లో నిఘాను మరింత పెంచేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గుంటూరుజిల్లా మంగళగిరిలో అటవీశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అటవీ భూముల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు ఉ పయోగపడేలా భూములకు కంచెలు వేసి, పరిరక్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. అడవుల్లో అరుదుగా లభించే నాణ్యమైన, మేలైన ఉత్పత్తుల నుంచి ఆదాయం పెంపుదలకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. గిరిజనులను భాగస్వామ్యం చేసి, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ప్రాజెక్ట్ ను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ పనులను

మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఇటీవల వెయ్యి కోట్ల రూపాయలు అందజేశామన్నారు. మూడు కట్టర్ల ద్వారా త్వరితగతిన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ( 36 సెకన్లు)

---------------------------

హైదరాబాద్ వేదికగా జరిగే 15వ హైదరాబాద్ సాహిత్య పండుగను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ రోజు ప్రారంభిస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ఈ 26 వ తేదీ వరకు జరుగుతుంది. ఇందులో భాగంగా సంస్కృతి, సాహిత్యంపై పలు కార్యశాలలు నిర్వహించనున్నారు. సాహిత్యం.. పర్యావరణం.. నూతన ఆవిష్కరణలు.. పిల్లల కథలు బోధించడం ఎలా? వారికి ఎలాంటి సాహిత్యం అవసరం.. వంటి విభిన్న అంశాల పై చర్చించనున్నారు. వేదిక కానుంది. ఐరోపా ఖండంలోని 'లిథువేనియా' దేశం ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఆ దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేలా ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేశారు. . భారత్‌లో లిథువేనియా రాయబారి హెచ్‌ఈ డయానా, ప్రముఖ సినీనటి షబానా అజ్మీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించనున్నారు.

---------------------------

జాతీయ బాలిక దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం. 2008 నుండి కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోప్రతి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం వంటి అంశాలపై బాలికలకు, సమాజానికి అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాలికల పట్ల కొనసాగుతున్న అసమానతలను తొలగించడమే జాతీయ బాలికాదినోత్సవం ముఖ్య లక్ష్యం. ఈ రోజు బేటీ బచావో, బేటీ పఢావోతో బాలికల సాధికారతను తెలిపేలా దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తూ పలు ప్రచారాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు నూతన సాఫ్ట్ వేర్ ను రూపొందించామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల మంజూరులో ప్రజాప్రతినిధుల జోక్యం ఉండదని చెప్పారు. ప్రభుత్వం అర్హుల నుంచి పారదర్శ కంగా వివరాలను సేకరిస్తుందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

దేశంలోని అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని డా. బీ ఆర్ అంబేద్కర్ అందించారని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లె లోని కోవెలకుంట్లలో భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను మంత్రి నిన్న ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహనీయులను స్మరించుకొంటూ...వారి విగ్రహాలు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్ , సుభాష్ చంద్రబోస్ జీవితాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు.

=====================